


# గరుడ స్తంభం

జి. వెంకటకృష్ణ

*ఇటువంటి ఊరిలో ఎవ్వరుండేరూ - ఇటువంటి ఊరిలో ఎవ్వరుండేరూ*
*కటకటా కనలాకు కానరానీ ఊరు - టక్కుయెక్కుల ఊరు కుక్కలుండే ఊరు*
*కుక్కలొచ్చి దూరితే కొంప గూలిపాయెరా - దొంగలొచ్చి పోతె యిల్లు ఉత్తదాయెరా...*
*ఇటువంటి ఊరిలో ఎవ్వరుండేరూ...*

తండ్రి పాడే తత్వం లీలగా గుర్తుకొస్తోంది నారాయణకు. రాత్రిపూట కుక్కిమంచంలో కూచుని పొగాకు పీలుస్తూ తీరిగ్గా, దుఃఖంగా పాడేవాడాయన.

'పాడినావులే ఆపు' అనేవాడు నారాయణ వినీ వినీ విసుగ్గా. తండ్రి చేసే వృత్తి అన్నా, ఆయన వంశాచారం అన్నా నారాయణకు ఇష్టం లేదు.

వారానికొకసారి తలకు పేటాజుట్టి, నుదుట తిరునామం దిద్ది, మెడకు తోలుతిత్తి తగిలిచ్చుకోని, ఒక చేతిలో వెలుగుతున్న గరుడస్తంభం, మరో చేతిలో మోగుతున్న జాగంటతో, 'అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా తిరునామధారీ సర్వజగద్రక్షకా,' అంటూ తిరుమంత్రం వల్లిస్తూ ఇల్లు ఇల్లూ తిరిగి ఆయన భిక్షం ఎత్తుతుంటే నారాయణకు ఏమాత్రం నచ్చేది కాదు.

"ఈ పని వద్దు నాయనా, సేద్యం చేద్దాం," అనంటే ఆయన తెల్లగా నవ్వి, "ఇది నా వృత్తిరా. మన తాతల తండ్రుల నుంచి సంక్రమించింది. అచలయోగ సాధన మనకబ్బడం అదృష్టంరా. దాన్ని నువ్వు అడుక్క తినడం అంటావా. నువ్వు కావాలంటే చేసుకో సేద్యం," అనేవాడు గరుడస్తంభం అందుకుంటూ.

నారాయణకు ఇవాళ అదంతా గుర్తుకొస్తోంది. తండ్రీ గుర్తుకొస్తున్నాడు. ఉండుండి నిశ్శబ్దంగా అతడి కంటి నుంచి కన్నీళ్లు జారిపడుతున్నాయి.

రెండురోజులుగా అలా నారాయణ మాటా పలుకూ లేకుండా కుక్కిమంచాన పడి ఉండటం చూస్తుంటే ఆదెమ్మకు భయం భయంగా ఉంది. ఎన్నడూ ఎంత రోగం వచ్చినా అడ్డం పడని మొగుడు ఇవాళ మంచానికి అతుక్కుపోవడం చూస్తే ఏమైపోతాడా అని గుడగుడగా ఉంది. రాత్రంతా ఆమె రెప్ప మూయలేదు. నారాయణకు కాపలాగా ఉంది ఏమైనా చేసుకుంటాడేమోనని.

రెండు రోజుల క్రితం శాంతప్ప కొడుకు మనుషుల్తో పాటు ఇంటికొచ్చినాడు.

"ఏమప్ప వస్తివి," అన్నాడు నారాయణ.

"నాయన చెప్పినాడు చెనిక్కాయలు తూకం వేసుకురమ్మని," అన్నాడు శాంతప్ప కొడుకు.

చెనిక్కాయ పంట చేతికొచ్చినప్పట్నుంచి శాంతప్ప ఈసారి పంట నా అప్పుకు జమేయాలని చెవిలో ఇల్లు గట్టుకొని పోరుతూంటే, మిగతా చిల్లర మల్లర అప్పులు ఎట్లన్నాగానీలే మొదట ఈయనకు అప్పు తీరుద్దామనుకున్నాడు. కష్టపడి పండించిన పంటను వచ్చిన మనుషులు తూకం వేసి, మూటలు కట్టి పడసాలలో సంచులుగా పేర్చుతుంటే చేయడానికి ఏమీలేక చూస్తూ కూర్చున్నాడు.

అంతా అయ్యాక, "మధ్యాహ్నం లారీ వస్తుంది. అప్పుడు తీసుకొనిపోతాం నారాయణ," అని చెప్పేసి పోయాడు శాంతప్ప కొడుకు తమ మనుషులతో.

వాళ్లట్లా పోయిన కొద్దిసేపటికే సొసైటీవాళ్లు వచ్చిపడ్డారు ఇంటి మీదికి.

"ఏమ్మా నారాయణుండాడా ఇంట్లో," అని విని పిస్తే టవల్తో మూతి తుడుచుకుంటా బయటికొచ్చినాడు.

''ఏం నారాయణ ఈరోజు కట్టల్లా అప్పు,'' అన్నాడు సొసైటీ సెక్రటరీ సుధాకరమయ్య. అతని వెనకాల పదిమంది బ్యాంకు ఆఫీసర్లు ఉన్నారు. వీధిలో పోలీసు జీపు నిలబడి ఉంది.

''దుడ్లు యాడుండాయి సార్ ఇప్పుడు... మొన్ననే క్రాపులోనుకు వడ్డీ జమేస్తిమే,'' అన్నాడు నారాయణ వాళ్ల వంక చూస్తూ.

''మొన్నంటే అదేందో నిన్న లేక మొన్న కట్టినట్లు మాట్లాడతావేమయ్యా. పోయిన సంవత్సరం కట్టిందే గదా. ఇప్పుడు నిన్నడుగుతాండేది క్రాపులోను సంగతి కాదు. బోరుకూ, మోటారుకూ నీ పేర మీదున్న అప్పు గురించి.''

''నేను తీసుకోని అప్పు నేనెట్లా కట్టాల సార్.''

''సూడబ్బా నీకు ఇప్పటికే నూటా తొంభైసార్లు చెప్పింటా రెడ్డి తీసుకున్న లోను నీ పేరుమీదనే ఉంది నువ్వే కట్టాల తప్పేదిగాదనీ. నువ్వు వినకపోతివి. జప్తుకు ఆర్డర్స్ కూడా ఉండాయి. అందుకే పై నుంచి పెద్దసార్లు వొచ్చిండేది. ఈరోజు కట్టాల్సిందే.''

''అవు సారూ నువ్వు చెప్పినావు. అయితే మేం తీసుకోని లోను మేమెట్లాకట్టల్లా. ఇదేమి న్యాయమూ... తీసుకొని అనుభవించినాయన్ను అడగల్లగానీ,'' ఆదెమ్మ గట్టిగా అరిచింది.

''ఊర్లో అందరికీ తెలుసులేమ్మా. పాత పురాణం ఇప్పొద్దు. వాళ్లతో ఇప్పించుకుంటారో మీరే కడతారో మీరే తేల్చుకోండి. ఈపొద్దు ఊరికే మాత్రం పోము,'' అన్నాడు సెక్రటరీ గట్టిగా.

''మేమేడ్నుంచి తెచ్చి కట్టాలా సామీ. మా నెత్తి మింద శనిలాగా పట్టుకుంది. ఆయప్ప ఊర్లో పెద్ద రెడ్డ య్యుండీ మా కొంపను ముంచి పాయెనే... మేము ఎవురితో సెప్పుకోవల్లా,'' ఆదెమ్మ చిన్నగా ఏడుపు ఎత్తుకుంది.

''ఏమే నువు నోర్మూయ్,'' అని పెండ్లాన్ని గెదురు కొని, పై నుంచి వొచ్చిన ఆఫీసర్లతో, ''సారూ, ఈ అప్పు సంగతే నాకు తెలీదు. రెడ్డిని నమ్మి మోసపోయినా. ఈ బాపనయ్య సెక్రటరీ, మా రెడ్డి ప్రెసిడెంటుగా ఉండే నన్ను ముంచిరి. నేను ఈ అప్పు కట్టలేను,'' అన్నాడు.

సార్లు సెక్రటరీతో కొంచెం ఇంగ్లీషు, కొంచెం తెలుగులో మాట్లాడి, ''చూడండి... మీరు దాసరి నారాయణ గదా. మీ పేరు మీద అప్పుంది. మీరే అప్లి కేషన్లో సంతకం పెట్టి మీ పొలం తాకట్టు పెట్టి తీసు కున్నారు. రికార్డ్సు ప్రకారమే మేం యాక్షన్ తీసు కుంటున్నాం. మీ పేరు మీదనే డిక్రీ కూడా పాస్ అయి ఉంది. మీరు లోను కంతులు బకాయీ కట్టాలా. లేకుంటే మీ పొలం వేలం వేస్తాము. ఇప్పుడు మీ ఇల్లు జప్తు చేసేందుకు వచ్చినాము,'' అని చెప్పి, ''సార్ సేలా ఫీసర్‌గారూ నోటీసు ఇవ్వండి,'' అని ముగించినారు.

ఆ మాటలు విన్నాక నారాయణ గొంతు పూడుకుపోయింది. ఎట్లాగో పెగుల్చుకొని, ''ఎంతైంది సారు నా పేరు మీద అప్పు,'' అన్నాడు అడగలేక అడగలేక.

సొసైటీ సెక్రటరీ లెక్కలు వేసి, వడ్డీలూ అపరా ధపు వడ్డీలూ, డిక్రీ ఖర్చులు కలిపి, ''నలభై ఎనిమిది వేలు,'' అన్నాడు.

నారాయణ గుండెలు అధఃపాతాళానికి జారి పోయినాయి.

''యెట్లా మల్లా. ఏమన్నా జమ వేస్తావా జప్తు చేయమంటావా,'' అన్నారు పెద్ద సార్లు.

''ఇదుగో శెనిక్కాయ మూటలుండాయి గదా. మేమే అమ్మి జమేసుకుంటాం,'' అన్నాడు సెక్రటరీ వాటివంక చూస్తూ.

ఆ మాటలు వినగానే మొగుడూ పెళ్లాలిద్దరూ మూటల దగ్గరకు పరిగెత్తారు.

''అయ్యో దేవుడా... మా ఊరి శాంతప్ప షావు కారికి అవుట్లని అమ్మేసినాము. ఆ యప్ప దగ్గరా అప్పుంది. అప్పుకు జమైపోయినాయి. అవి నావిగాదు మీరు తీసకపోయేదానికి,'' అన్నాడు నారాయణ మూట లకు అడ్డం నిలబడుతూ.

''ఊర్లో అప్పుకైతే కడతావు సొసైటీ అప్పుకైతే కట్టవా. అమ్మినావని ఏం గ్యారంటీ. అమ్మితే మాత్రం నీ ఇంట్లో ఉన్నవి నీవే. ఇవే జప్తు చేస్తాం.''

జప్తుకై వచ్చిన అధికారులు అప్పటికప్పుడు ఒక ట్రాక్టర్ తెప్పించి శనక్కాయ మూటల్ని ఎత్తిస్తుంటే నారాయణ వాళ్లకడ్డంపడి గడ్డాలు పట్టుకొని, 'స్వామి స్వామి,' అంటూ బ్రతిమిలాడాడు.

''నాకు మాటొస్తుంది. పొద్దున్నే తూకం వేసుకొని పోయినారు. ఈసారికి వొదిలెయ్యండి. నేను తీసుకో లేదని తెల్సీ నాతో వసూలు జేస్తారా. ఏం సెక్రటరీ సారూ... ఎంక్వయిరీ చేయిస్తిమంటిరి... రెడ్డితోనే కట్టిస్తా మంటిరి... ఆయన కూడా ఒప్పుకునా... ఇబ్బుడిట్లా నా పరువు తీస్తారా,'' అని అడిగినాడు.

''రామిరెడ్డి ఉన్నింటే నీ తరఫున మేమే ఆ యప్పని అడిగిందుము... ఆ యప్పే సంసారమిడిసి పెట్టి పాయ. ఇంగిబ్బుడు మాకు వేరే దారేముంది. నీతో వసూలు జేయాల్సిందే. అప్పులు వసూలు జెయ్యకుంటే మా ఉద్యోగాలు పోతాయి. ఆర్నెల్లుగా మాకే జీతాలు లేవు. అప్పులు వసూలు జేసి సంఘాలు లాభాల్లోకొస్తేనే

సిబ్బందికి జీతాలని గవర్నమెంటు సెప్తాంది. మమ్మల్నేం జేయమంటావు జెప్పు," సొసైటీ సెక్రటరీ అంతే బాధతో బదులిచ్చినాడు.

నారాయణకు కడుపు మండిపోయింది.

బండి గుజ్జు ఒకటి తీసుకొని, "నాకొడకా... చెప్తాంటే నీకు గాదూ," అని సెక్రటరీ పైకి దూకినాడు.

అతని దెబ్బ పడకముందే ఫట్‌మంటూ పోలీసుల దెబ్బపడింది నారాయణ మీద. పక్కకి ఈడ్చి పడేసినారు అతణ్ణి. దుమ్ములో గొడ్డులాగా పడి మూలుగుతుంటే ఆదెమ్మ 'ఓమ్మో ఓయ్యో' అంటూ అతడి దగ్గర కూర్చుని ఏడుపు అందుకుంది.

చుట్టుపక్కల వాళ్లొచ్చి బొమ్మల్లాగా నిలబడి నారు.

ట్రాక్టరు, జీపులూ కదిలి వెళ్లిపోయాయి. ఆ వెనుకనే షావుకారు శాంతప్ప లబోదిబోమంటూ పరి గెత్తుకుంటూ వచ్చాడు.

"నాకు తూకమేయించిన మూటలు ఎట్లా ఎత్తి స్తివి. నా అప్పు ఎవరు కడతారనిరా," అన్నాడు వచ్చీ రావడంతోటే నారాయణ పైకి వెళుతూ.

"నా చేతుల్లో ఏముందన్నా. నీకు అమ్మినానని ఎంత మొత్తుకున్నా ఇనకుండా జప్తు చేసుకొని పోతాం డారు. ఇంతమందీ చూస్తానే ఉండారు. వాళ్లనే అడుగు స్వామీ," అన్నాడు నారాయణ.

"ఓర్నీ... ఇదా నువ్వు జెప్పేది. పంట మీద ఇత్తనాలకిస్తీ, తిండి గింజలకిస్తీ. నా అంగిట్లో అంతా నీలాంటి నా కొడుకులు పెట్టిండేటివే అప్పులు. తల మాసిన నా కొడుకుల కోసమే నేను అంగడి నడుపు తాండానా. పేటలో షావుకారికి నేనేమి చెప్పకోవల్లా."

"ఏమి జెయ్యమంటావు సామీ. నీ కాళ్లు పట్టు కుంటా. ఈసారికెట్లన్నా సర్దుకో. మల్లీసారి తీరుస్తా."

"ఏం దీరుస్తావురా గబ్బునాకొడకా. సొసైటీ అప్పు తీరేదా పెట్టేదా. మల్లీసారి వాళ్లే గుంజుకుపోతారు. నా అప్పు మిగిలిపోతుంది. నేను యినేదిలేదు. ఎట్ల కడతావో కట్టు. కట్టందే నేను పోను. నీ యింటికాడ్నే కూచుంటా."

"కూచ్చో సామీ. వొద్దంటామా. లాకుంటే నీ ఇంటికాడ కుచ్చోమంటావా కుచ్చుంటాను. యీ బతుక్కు అది తప్పేదేముంది."

"నిన్ను మా యింటి కాడ కూచోబెట్కుని నీకు కూడు పెట్టడానికి నీకేమన్నా బాకీ చేసినామా మేం ఫకీర్ నాకొడకా. తూకం వేయించినట్లే వేయించి మాకు తెలీ కుండా ఎత్తిస్తావా," అంటూ శాంతప్ప నారాయణను కింద పడేసి తన్నినాడు.

నారాయణ మారుమాట్లాడకుండా దెబ్బలు తిని ఇంటి ముందు అట్లాగే కూలబడినాడు. ఆదెమ్మ భర్త మీదపడి ఏడుస్తా ఉంది. చుట్టుపక్కలవాళ్లు శాంతప్పను పట్టుకున్నారు.

వాళ్లను విడిపించుకుంటూ, "మాకెన్ని అప్పులుం డాయో మీకు తెలీదా. మేమేమన్నా బాగా బతికిపోయి నోల్లమా. వీని మాదిరిగా అందరూ ఎగ్గొడితే ఆడ మేము చేసిండే అప్పులు ఎవరు తీర్చల్లా. వాళ్లు మా ఇండ్ల మీద పడరా... మేమూ రామిరెడ్డికట్ల సంసారమిడిసి, ఊరి డిసి పెట్టి పారిపోవాల్సిందే గదా. ఆ యప్పదే మేలు చేసినవన్నీ చేసి చల్లగా జారుకునా," గొంతులో దుఃఖం పొంగుకొస్తూంటే తండ్రీ కొడుకులు ఆపుకుంటూ వెళ్లి పోయినారు.

ఇంటి ముందు అవమానంతో కూలిపోయిన నారాయణను వీధిలో వాళ్లు లేపి కూచోపెట్టినారు. ఎవరో లోటాతో నీళ్లిస్తే గటగటా తాగి మంచం మీద కొచ్చిపడ్డాడు. అంతే. మరింక లేవలేదు. మాట్లాడలేదు. భార్య పిలిస్తే పలకడం లేదు. అప్పుడప్పుడు రెప్పలు తెరుస్తుండాడు మూస్తుండాడు. భార్య ఏడుపు వింటూ ఉన్నాడు.

అతడికి మళ్లీ తండ్రి గుర్తుకొచ్చాడు.

*ఉచ్చుగట్టే గూలు దోలే మహాత్ములుండే ఊరు*
*దొంగలుండే ఊరు...*

తండ్రి సంపాదనను, కడుపుకు తినీ తినక దాచి పెట్టిన రెక్కల కష్టాన్ని కలిపి నాలుగెకరాలు కొని సేద్యానికి దిగుతున్నప్పుడు, 'జాగ్రత్త నాయనా. కరువు సేద్యం గండం,' అన్నాడాయన భద్రం చెబుతూ.

కరువుసేద్యంలో ఎన్ని గండాలుంటాయో అతడికి ఇప్పుడు అర్థమైంది.

"ఏందయ్యా నా ఇంటి ముందొచ్చి గోడాడుతాం డావు. యిబ్బుడు నా యింటికి పట్టిండే శని సాల్దనా... అయన్నూస్తే దేశాలు పట్టిపాయా... యాడున్నాడో ఎతికి పట్టుకొని నీ అప్పు కట్టించుకో పో... ఈ సంసారం ఏగల్యాకా అప్పులోల్ల బాధలు పడల్యాక నా సావు నేను సస్తాంటే నువ్వొగడివి. నా ఇంటి ముందు ఏడవద్దు. నా ఏడుపు ఎవరు జూస్తాండారు."

రామిరెడ్డి భార్య దగ్గరకు వెళ్లి అప్పు సంగతి మాట్లాడినప్పుడు ఆమె పెట్టుకున్న కన్నీళ్లు అతడికి గుర్తుకొస్తా ఉన్నాయి.

శాంతప్పా, శాంతప్ప కొడుకూ ఏడ్చి,
రెడ్డి భార్యా ఏడ్చి,
తనూ, తన భార్యా ఏడ్చి...

అందరూ ఏడుపులేనా? ఊరిలో ఏం జరుగుతూ ఉంది?

ఏ దారి వచ్చితివో ఆ దారినే బోవ
యిక జన్మమే లేదు చిలుకా...
దారి తెలియక పెన్నేటిలోన బడి
అల్లాడిపోవకే చిలుకా...

తండ్రి గొంతు అతడి లోపలి నుంచి వినిపిస్తా ఉంది.

నాలుగేళ్ల కిందట వానలు యిక కురవవేమోనని భయపడుతూన్న కార్తెలో ఊర్లో కప్పల పెండిండ్లూ, గాడిదల ఊరేగింపులూ, తొండేబిక్కి పెండ్లిండ్లూ జరుగుతున్నప్పుడు ఊరికి పట్టిన శని వదిలించుకోవడానికని పొలిమేర మారెమ్మను చేసి ఊర్లో అందరిండ్ల నుంచి పాత శాటలూ, జల్లెళ్లూ, రోళ్లూ పారేసి రావడానికి వొలికిలిగడ్డకు పోతూ ఉంటే, ''రామిరెడ్డోళ్ల ఇంటి తాన పాతది రోలుంది దాన్నీ తాపోండి,'' అని ఎవరో పెద్దాయన చెప్తే గుంపుతో పాటు నారాయణా పోయినాడు.

''నారాయణా, మా ఇంటి దరిద్రం గూడా తీసక పొయ్యేకి వొస్తివా. ఎంత మంచోడివిరా నువ్వు. వాళ్లు తీసకపోతారుగానీ నువ్వురా,'' అని పిలిచి, ''ఇదుగో టీ తాగు,'' అని రామిరెడ్డి ఇస్తే ఆనందంగా తాగినాడు.

అక్కడే ఉన్న సొసైటీ సెక్రటరీ సుధాకరమయ్య, ''ఇదిగో నారాయణా నీకు అదృష్టం కలిసొస్తాన్నట్లుందయ్యా,'' అన్నాడు నవ్వుతూ.

''ఏంది బాపనయ్యా నువ్వు చెప్పేది,'' అన్నాడు నారాయణ.

''ఏంలేదురా నారాయణ. నా తోట పక్కనుండే నీ చేన్లో బోరేపిచ్చి మోటారు మన సొసైటీ నుంచి ఇప్పిస్తామనుకుంటాండా. కొత్త స్కీమొకటి వచ్చింది. యిదిగో అప్లికేషన్. ఆలస్యం చేయకు,'' అన్నాడు రెడ్డి.

ఆ తర్వాత వాళ్లిద్దరూ ఏవేవో వివరాలు చెప్తుంటే కమ్మటి పాట విన్నట్లున్నింది నారాయణకు. క్రాపు లోనుతో పాటు, బోరు లోనూ వస్తుందనే సంబరంలో వెనుకా ముందూ చూసుకోకుండా వాళ్లు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టేసినాడు. ఆ తర్వాత తెలిసింది తనలాగే ఊర్లో పదిరవైమందిదాకా అప్లికేషన్లు పెట్టుకున్నారనీ, వాటి అతీగతీ తెలియదని.

ఆర్నెల్లు గడిచాక రెడ్డి తన తోటలో ఇంకొక బోరే పించుకొన్నాడు. మోటారు బిగించుకున్నాడు. కూతురి పెండ్లి ఘనంగా చేశాడు. ఆ పెండ్లిలో వీళ్లంతా తిరిగి ఏర్పాట్లు చూసి రెడ్డిచ్చిన నూరో యిన్నూరో ఖర్చులకు తీసుకొని లోన్ల విషయమే మరిచిపోయారు. కలెక్షన్ సీజన్లో ఇండ్లకు నోటీసులొస్తే అవెందుకొచ్చినాయో తెలీక సెక్రటరీ దగ్గరకు వెళ్లారు.

''మీ పేర్ల మీద సొసైటీ ప్రెసిడెంటు రామిరెడ్డి లోన్లు తీసుకున్నాడు. మొదటి కంత మాత్రం కట్టి ఊరుకున్నందుకే నోటీసులు వచ్చాయి,'' అన్నాడు సెక్రటరీ.

అందరికీ కోపం వచ్చింది.

''లోన్లు వాడుకున్నప్పుడే యీ మాట చెప్పగూడదేమయ్యా ఇబ్బుడు చెప్తున్నావే. నీకూ యిందులో భాగం లేకుండా ఉంటుందా,'' అన్నారు.

''దైవసాక్షిగా నాకు భాగం లేదు. మీ రెడ్డి నా నోరు నొక్కేసినాడు. నా జీతాలమింద గూడా కమిషన్ ఇమ్మని పీడిస్తాండాడు. ఇట్లాంటి తాగుబోతుని, నీచుణ్ణి యాడా చూళ్లేదు. ఇబ్బుడైనా మీ మంచికే చెబుతున్నా. రెడ్డితో అప్పులు కట్టించి బయటపడండి. లేకుంటే మీ నెత్తి కొస్తుంది.''

ఆయన మాటలకు భయపడి నారాయణ రామిరెడ్డిని కలిసి, ''ఏంది రెడ్డి ఇంత అన్యాయమా,'' అన్నాడు.

''ఏం లేదులేరా. ఇబ్బందులుంటే వాడుకున్నా. నిన్నేమన్నా కట్టమంటాండానా. నాకెంత భూముందో నీకు తెలుసు. పంట పండితే నీ అప్పు నాకొకలెక్కనా. నీ రుణంతో పోతానా. భయపడొద్దు. ఆ బాపనయ్య మాటలు వినొద్దు. నేనే ప్రెసిడెంట్. నీ మీదకు రాకుండా చూసుకుంటా,'' అన్నాడు.

ఆయన మాటలు నమ్మి ఆయనే చూసుకుంటాడులే డెబ్బయి ఎకరాల ఆసామి కదా అనుకున్నాడు. ఆ తర్వాత రామిరెడ్డి డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీలో సొసైటీ సొమ్ము లక్షల్లో వాడుకున్నాడని తేలింది. అవి వసూలు చేయడానికి ఉత్తర్వులు రావడంతో పంటలు పండక, చేసిన బయటి అప్పుల తాకిడికి తట్టుకోలేక ఒకనాడు ఊర్నించి మాయమైపోయినాడు రెడ్డి. ఇప్పటికీ ఎక్కడున్నాడో ఎవరికీ తెలియడంలేదు.

ఆదెమ్మ తట్టితట్టి లేపుతుంటే నారాయణ బలవంతంగా కళ్లు తెరిచాడు.

''పైకి లేచి అట్ల కుచ్చో... ఎందుకట్ల పండుకుంటావు,'' నీర్సంగానే అంటోంది ఆమె. అతను లేస్తే తను కొంచెం ధైర్యంగా ఉండొచ్చు అనుకుంటోంది.

నారాయణ పైకి లేచి కూచున్నాడు. మంచినీళ్లిస్తే నిదానంగా తాగాడు. అసల సందేళ. చీకటి ముసురు కుంటోంది. కరెంటు పీకేసిన ఇంటి మధ్యలో మంటలాగా వెలుగు కనిపిస్తూ ఉంది.

పరికించి చూశాడు. గరుడస్తంభం.

అటకమీద పడున్న దానిని ఆదెమ్మ దించి నూనె బోసి వెలిగిచ్చినట్టుంది. దాన్ని చూస్తూనే తండ్రి గుర్తొచ్చినాడు. ఆయన చేతుల్లో అది ఊరంతా వెలుగుతూ తిరిగింది. నామధారుల ఇండ్లలో చావులకు, పెత్తర్ల అమా

వాస్య తంతులకు హాజరయ్యింది. దిగులు లేకుండా తిండి పెట్టింది. కానీ నేరుగా తిండి పెట్టాల్సిన సేద్యం ఇవాళ చీకటిని మిగిల్చింది.

లేచి నిలబడి అడుగులు బయటికేశాడు.

"యాడికి యింత చీకట్లో," ఆదెమ్మ అడిగింది.

"కమ్మ నరసింహుల్ని కలిసొస్తా," అని బయ ల్దేరాడు.

నారాయణ పోయేటప్పటికి మల్బరీ ఆకు కట్ చేసి రేషం పురుగులకు వేస్తున్నాడు నరసింహులు. దిగులు కమ్ముకొని ఉన్న నారాయణ మొఖం చూసి అతడు చెప్పినదంతా విని, "అంత అధైర్యపడితే యదారు తీరుతుందా. నీ స్నేహితులం నాలాంటివాళ్లం లేమా?" అన్నాడు.

"అవునబ్బా నీయ్యాకట్ల మిగులుబాటులో లేదు నా బతుకు. నువ్వు ఎన్నైన్నా చెబుతావు..."

"నేనేమీ చెప్పడంలేదుగానీ... ఇప్పుడు ఏం చెయ్యాల్నుండావో చెప్పు..."

"ఏమీలా... మీ తోటతానకి వాల్లొస్తాంటారు గదా... వాల్లనొగసారి కలసాలనుకుంటాండా..."

"ఎవరు వాల్లు..."

"వాల్లేనబ్బా... సార్లు..."

"ఓహో వాల్లా... వాల్లమీద ఎంత నిఘా వుందనీ... వాల్లని రానిస్తాండారా... అయినా వాల్లని కలిసి ఏం చేయాలనుకోండావో..."

"వాల్లేమన్నా పంచాయతీ చెప్పి రెడ్డి భార్యతో నా లోన్ కట్టిస్తారేమోనని..."

"నీ అమాయకత్వానికి నవ్వొస్తా ఉంది... వాల్లైనా సులోచనమ్మను ఎందుకు కట్టమంటారు. ఆయమ్మ మొగుడు చేసిన మోసానికి ఆమె బాధ్యత ఎంతా అనరా..."

"అంతేనంటావా..." నీరుగారిపోయినాడు నారాయణ.

"అంతే. అయినా నువ్వు ఆ అప్పు తీర్చకుంటే ఏమౌతుంది..."

"ఏమౌతుందా... చేను వేలానికొస్తుంది," ఆవేశంగా, బాధగా అన్నాడు నారాయణ.

"కానీలే... భూమి వేలానికే రానీలే... వేసుకో మను. ఎవుడొచ్చి కొంటాడో కొనమను... ఎవురి దగ్గర భూమి కొనే తాహతుంది మనూర్లో... అంత మిగులు బాటు వుండేవాల్లు నీ భూమినే ఎందుకు కొంటారు. అందుకే ధైర్యంగుండమంటున్నా..." నరసింహులు చెప్తూనే ఉన్నాడు, నారాయణ లేచి నిలబడ్డాడు.

"నారాయణా... ఏయ్ నారాయణా నిలబడూ... మాట," చీకట్లో నరసింహుని మాటలు కలిసి పోయాయి.

ఇంటికొచ్చి ఆదెమ్మ మాట్లాడిస్తున్నా పలక్కుండా ఆరుబయట మంచమ్మీద వాలిపోయినాడు. అతడికి భూమినెట్ల మిగిలించుకోవాలో... ఈ అవమానాన్ని ఎట్లా భరించాలో, దారి తెలియకుండా ఉంది.

రాత్రి పొద్దుబోయింది. కీచురాళ్ల చప్పుడూ, దూరంగా పిల్లులు కొట్లాడుతున్న భీకర శబ్దమూ, ఎక్కడో తీతువు అరుపూ తప్ప అంతా మహా నిశ్శబ్దంగా ఉంది... తనకు వేరే దారి ఏదీ లేదని నారాయణకు అర్థమైంది. నీరసంగా లేచి, అరుగు మీద అలా పడి నిద్రబోతున్న భార్యను చీకట్లో దీర్ఘంగా చూసి, తడిక తెరుచుకొని ఇంటిలోనికి పోయినాడు.

దుఃఖం ఆగకుండా ఉంది. చెంపల వెంబడి బాధ, అవమానం కరిగి కారిపోతూ ఉంది. లోపల గరుడస్తంభం మినుకు మినుకుమంటోంది. ఇవే తన ఆఖరి క్షణాలనుకొని ఒకసారి చేత్తో దాన్ని తాకి కళ్లకు అద్దుకున్నాడు.

*పుచ్చుగట్టీ గూలుదోలే మహాత్ములుండే ఊరురా*
*మచ్చు యిరిగే పడుతూనే మాయమైపోయెరా...*

తండ్రి పాడిన పాట గుర్తుకొచ్చింది. నిశ్శబ్దంగా గరుడ దీపాన్ని చేతిలోకి తీసుకున్నాడు. తండ్రిని స్పర్శించినట్లే వుంది. ఆ స్పర్శ బతకమని చెప్తూ వుంది. అంతరాత్మ, బతికేం సాధిస్తావంటోంది.

"వేలానికే రానీలే... ఎవుడొచ్చి కొంటాడో కొనమను..." నరసింహులు గొంతు విన్పిస్తాంది. నారాయణలో చెప్పనలవిగాని భావోద్వేగాలు ఎగిసెగిసి పడుతున్నాయి. వెలుగుతున్న గరుడస్తంభాన్ని దించి, ఒక్కక్షణం కాలం దీర్ఘంగా చూసి, వొక్కుదుటున దాన్ని చేతుల్లోకి తీసుకొని, జాగంట నందుకొని,

*అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా*
*తిరునామధారీ సర్వజగద్రక్షకా...*

అంటూ తడిక తీసుకొని చీకటి వీధుల వెంట దీపధారుడై నడకందుకున్నాడు. అతను మోగిస్తున్న జాగంట మోతతో వులిక్కిపడి వూరు మేల్కొంటోంది.

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 మే 2004***

